సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 10 । జనవరి । 2025



'ఎల్లంపల్లి'లో మొసళ్లు

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిలో మొసళ్ల కలకలంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. బ్యాక్‌వాటర్‌లో చేపలు పట్టేందుకు జంకుతున్నారు. 8లో▸



సర్వే పూర్తి.. మంజూరెప్పుడో?

ఇందిరమ్మ ఇళ్ల సర్వే అన్నిగ్రామాల్లో దాదాపు పూర్తయ్యింది. పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.2 /15.5

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. చలి ప్రభావం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న నాలుగు టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శివచరణ్, ఎస్‌వో మీనా ఒక ప్రకటనలో తెలిపారు. అతిథి(గెస్ట్) ఉపాధ్యాయులుగా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బయోసైన్స్, ఫిజికల్ సైన్స్, తెలుగు, నర్సింగ్– 2 సబ్జెక్టులు బోధించేందుకు నాలుగు పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. బయో సైన్స్, ఫిజికల్ సైన్స్ పోస్టులకు బీఎస్సీ, బీఎడ్‌తోపాటు టెట్ ఉత్తీర్ణత ఉండాలని, అలాగే తెలుగు పోస్టు కోసం ఎంఏ, బీఎడ్, నర్సింగ్– 2 కోసం బీఎస్సీ లేదా ఎంఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. జిల్లాలో అర్హత మహిళా అభ్యర్థులు ఈ నెల 10లోపు వాంకిడి కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు క్రీడాపాఠశాల విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, హ్యాండ్‌బాల్ కోచ్ అరవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు 8వ తరగతి విద్యార్థులు వైష్ణవి, శ్రీలత, అథ్లెటిక్స్ పోటీలకు 9వ తరగతి విద్యార్థి శైలజ, హ్యాండ్‌బాల్ పోటీలకు నందిని, కవిత, సత్యభామ ఎంపికయ్యారని పేర్కొన్నారు. క్రీడాకారులు, కోచ్‌లను డీఎస్‌వో మీనారెడ్డి, హెచ్‌ఎం జంగు అభినందించారు.

ఉత్సవాలకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ శరత్, ప్రతినిధులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం ఇందాపూర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే పోతురాజు, ధర్మరాజు ఉత్సవాలకు హాజరు కావాలని సిడాం వంశీయులు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ శరత్‌ను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో గురువారం ఆయనను కలిసి ఆహ్వానపత్రం అందించి, ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి, విద్యుత్ సౌకర్యం కల్పించి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు సిడాం ధర్మూ, సిడాం బాపూరావు, సిడాం రాజు, కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

తిర్యాణి(ఆసిఫాబాద్): గంజాయి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని గోపెర గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం 200 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గంజాయి వినియోగం ద్వారా జీవితం అంధకారంగా మారుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉద్యోగ సాధనపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ స్వామి, ఎస్సై శ్రీకాంత్, నాయకులు అనిల్‌గౌడ్, సాగర్ పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల మహాసభ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కేశవ్‌రావు అన్నారు. మండలంలోని బూర్గుడ, చిర్రకుంట, తుంపెల్లిలో గురువారం గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. మహేష్, వెంకటేశ్, మల్లేష్, సంతోష్, సాయి పాల్గొన్నారు.

సౌర వెలుగులు!



ఆసిఫాబాద్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కేవీ సోలార్ ప్లాంటు

మీ ఇంటి కరెంటు బిల్లు నెలకు రూ.వెయ్యి దాటుతోందా? భవిష్యత్తులో ఇది మరింత పెరుగుతుందని భావిస్తున్నారా? అయితే మీ సొంత ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు చేసుకోండి.. మీ సమస్యకు పరిష్కారం లభించడమే కాదు.. సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇంటికి వాడుకోగా మిగిలిన దానిని తిరిగి ట్రాన్స్‌కో డిస్కంకే అమ్మి సొమ్ము చేసుకునే చక్కటి అవకాశాన్ని 'పీఎం సూర్య ఘర్' పథకం కల్పిస్తోంది.

- 'పీఎం సూర్య ఘర్' కింద ఇంటింటా సోలార్ ప్లాంట్లకు ప్రోత్సాహం
- మహిళా సంఘాల ఆధ్వర్యంలోనూ ఏర్పాటు
- ఐదు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా కసరత్తు
- జిల్లాలో ఎస్‌హెచ్‌జీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దన్ను

సాక్షి, ఆసిఫాబాద్: సోలార్ ప్లాంట్లు.. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో అధిక సంఖ్యలో ఏర్పాటు కాగా ఇప్పుడిప్పుడే ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. పీఎం సూర్య ఘర్ యోజన కింద సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రాయితీ సైతం ఇస్తోంది. గృహ అవసరాలకు సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలనే వారు 'సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపిక చేసిన ఏజెన్సీ వాళ్లు దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉంటే యూనిట్ ఏర్పాటు చేస్తారు. బ్యాంకు రుణం, డిస్కమ్‌తో అగ్రిమెంట్ చేసుకోవడం లాంటివి వారే చూసుకుంటారు. గతంలో సోలార్ ప్లాంట్ల ద్వారా తయారైన విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వ చేసి రాత్రి వేళ ఇంటి అవసరాలకు వినియోగించుకునేవారు. ప్రస్తుతం బ్యాటరీలు లేకుండానే ఇన్వర్టర్ సాయంతో డీసీ కరెంట్‌ను ఏసీ కరెంట్‌గా మార్చేసి నేరుగా గ్రిడ్‌కు అనుసంధానిస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో భారీ ప్యానెళ్లు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)ను ఎంపిక ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 36 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న సర్కారు ఖాళీ స్థలాల్లో ఆయా ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే నిర్ణయించారు. పీఎం కుసుమ్ యోజన కింద జిల్లాలో 5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఒక్కో మెగావాట్ సామర్థ్యానికి 2.5 ఎకరాల స్థలం అవసరమవుతుంది. స్థలాలు ఖరారు కాగానే ఎస్‌హెచ్‌జీలకు కేటాయిస్తారు. ఒక్కో మెగావాట్‌కు రూ.4 కోట్లు ఖర్చు కానుండగా.. ఎస్‌హెచ్‌జీలు తమ వాటా కింద 10 శాతం చెల్లిస్తే మిగతా మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణంగా ఇస్తారు. 25 ఏళ్లపాటు ఎస్‌హెచ్‌జీలకు ఈ ప్లాంట్లు అప్పగిస్తారు. 15 ఏళ్లలో ప్లాంట్ల నిర్మాణ ఖర్చు తిరిగి వస్తుంది. మిగిలిన పదేళ్ల పాటు విద్యుత్తు ఉత్పత్తి ద్వారా సంఘాలకు ఆదాయం సమకూరుతుంది.

ఖర్చు.. రాయితీ

సాధారణంగా ఇళ్లకు మూడు కిలోవాట్లు అంతకన్నా ఎక్కువ కిలోవాట్ల ప్లాంటు ఏర్పాటు చేసుకుంటారు. మూడు కిలోవాట్ల ప్లాంటు ఏర్పాటుకు రూ.1.60 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద రాయితీలు ఇస్తోంది. ఒకవేళ కిలోవాట్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే రూ.84 వేలు ఖర్చు అవుతుండగా ఇందులో రూ.30 వేలు రాయితీ వస్తోంది. ఇదేవిధంగా మూడు కిలోవాట్ ఆపై 10 కిలోవాట్ల వరకు ఏర్పాటు చేసుకునే ప్యానెళ్లకు రూ.78 వేలు రాయితీ లభిస్తోంది.



డీసీ కరెంట్‌ను ఏసీ కరెంట్‌గా మార్చే ఇన్వర్టర్

రోజూ విద్యుత్ ఉత్పత్తి

సాధారణ ఎండగా ఉన్న రోజుల్లో ప్రతి కిలోవాట్‌కు ప్రతిరోజూ 4 యూనిట్ల కరెంటు ఉత్పత్తి అవుతుంది. అంటే మీ ఇంటిపై 3 కిలోవాట్ల ప్యానళ్లు అమర్చుకుంటే ప్రతిరోజూ 12 యూనిట్ల(కిలోవాట్ అవర్) కరెంటు ఉత్పత్తి అవుతుంది. నెలకు 360 యూనిట్లు తయారవుతుంది. మబ్బులున్న రోజుల్లో మాత్రం తగ్గిపోతుంది. ఎండాకాలంలో రోజుకు 15 యూనిట్లతో నెలకు 450 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఇందులో మనం ఇంటి అవసరాలకు 250 యూనిట్లు ఖర్చు చేసినా మిగిలిన మిగతా 110 నుంచి 200 యూనిట్ల విద్యుత్ ట్రాన్స్‌కో డిస్కమ్ గ్రిడ్‌కు వెళ్లిపోతుంది.

యూనిట్ల లెక్కింపు ఇలా...

డిస్కమ్‌తో లబ్ధిదారులు చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రతీ ఆరు నెలలకోసారి డిస్కమ్ ఇంట్లో ఏర్పాటు చేసిన నెట్‌మీటరు సాయంతో మనం ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడింది, ఇంకా ఎంత మిగిలింది లెక్క వేస్తారు. లబ్ధిదారులు ఖర్చు చేయగా మిగిలిన యూనిట్లకు లెక్క వేసి రూ.4.50 చొప్పున లెక్కించి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

'ముక్కోటి'కి ముస్తాబు



జిల్లా కేంద్రంలోని శ్రీకేశవనాథస్వామి ఆలయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీకేశవనాథస్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ(ముక్కోటి) ఏకాదశికి దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ఉదయం 5 గంటలకు స్వామివారికి అభిషేకం, ఆలయ ముఖద్వారం ద్వారా ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణల అనంతరం ఉత్తర ద్వారం ద్వారా స్వామివారితో ఆలయ ప్రవేశం చేయనున్నట్లు అర్చకులు ఒజ్జల నరేష్‌శర్మ తెలిపారు. స్వామివారి ప్రవేశానంతరం భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, అధికారులు తరలిరానున్నారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఉపాధిహామీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో జరిగే అభివృద్ధితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద 4 క్లస్టర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని ఆదేశించారు. మండల కేంద్రాలకు వివిధ పనుల కోసం, వారసంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం ప్రజా మూత్రశాలల నిర్మాణానికి స్థలాలు గుర్తించి పనులు ప్రారంభించాలన్నారు. 2025– 26 ఆర్థిక సంవత్సరంలో ప్రతీ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వందశాతం ఇంటి పనులు వసూలు చేయాలన్నారు. రానున్న వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్యలు లేకుండా నిరంతరం తాగునీటి సరఫరా చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి గురువారం నీటిపారుదల, రోడ్లు భవనాలు, సింగరేణి, రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రాజెక్టులు, చెరువులు, కాల్వలు, వంతెనలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సింగరేణి రైల్వేలైన్ విస్తరణలో అవసరమైన భూముల సేకరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుమురంభీం, జగన్నాథ్‌పూర్, పీపీరావు ప్రాజెక్టులు, చెరువులు, కాలువ నిర్మాణానికి భూ సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతుల అంగీకార తీసుకుని అవార్డులు రూపొందించాలన్నారు. బాధితులకు నష్టపరిహారం త్వరగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులను సత్వరమే పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈ గుణవంత్‌రావు, ప్రభాకర్, సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంధనం బకాయిలొచ్చాయి..!

- జిల్లా పోలీసుశాఖకు ఊరట

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా పోలీసుశాఖకు ఆర్థిక శాఖ ఇంధనం బకాయి నిధులు విడుదల చేసింది. పది నెలలుగా పెట్రోల్, డీజిల్ కోసం నిధులు రాకపోవడంతో గస్తీ వాహనాల నిర్వహణకు పోలీసు అధికారులు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. బకాయిలు పేరుకుపోవడంతో పెట్రోలు బంకు యజమానులు పోలీసు శాఖకు చెందిన వాహనాలకు డీజిల్, పెట్రోలు పోయడానికి ఆసక్తి చూపడం లేదు. దీనిపై 'ఇంధనం కష్టాలు' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. సర్కారు నిధులు విడుదలకు ఆర్థిక శాఖకు ఆదేశాలివ్వడంతో గురువారం నాటికి రూ.కోటికిపైగా రావాల్సిన 10 నెలల ఇంధన బిల్లుల నిధులు మంజూరయ్యాయి.

క్రీడలతో సంబంధాలు మెరుగు

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: క్రీడలతో ఉద్యోగుల మధ్య స్నేహపూరిత సంబంధాలు మెరుగుపడతాయని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం యాన్యువల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో బిజీగా ఉండే పోలీసుల్లో నూతనోత్సాహం నింపేందుకు స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారిని ఈ నెలాఖరులో కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ(అడ్మిన్) పెద్దయ్య, ఆర్‌ఐఎంటీవో అంజన్న, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రీడలు ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్

పోలీసు సేవల గురించి ఫిర్యాదుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ స్వీకరించేందుకు క్యూఆర్ కోడ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం క్యూఆర్ కోడ్ సేవల పోస్టర్ ఆవిష్కరించారు. ఫిర్యాదు, పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈచలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలపై అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ రామానుజం, సీఐ రవీందర్, ఎస్బీ సీఐ రాణాప్రతాప్, ఎస్సైలు చంద్రశేఖర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

జిల్లా గజ గజ

కౌటాల(సిర్పూర్): జిల్లా చలికి గజ గజ వణుకుతోంది. మూడు రోజులుగా మళ్లీ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. శీతల గాలులు ప్రజలను భయపెడుతున్నాయి. గురువారం రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్(యూ)లో 5.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 5.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, తిర్యాణి మండల కేంద్రంలో 7.2, కెరమెరి 7.5, వాంకిడి, ధనోరా 7.8, సిర్పూర్(టి), బెజ్జూర్ 9.3, కాగజ్‌నగర్, వంకులంలో 9.4 డిగ్రీలుగా నమోదైంది. డిసెంబర్ చివరి వారం నుంచి మామూలుగా ఉన్న చలి జనవరి రెండో వారంలో ఒక్కసారిగా పెరిగింది. జిల్లాలోని 14 ప్రాంతాలు అలర్ట్ జోన్‌లో ఉండగా.. మిగతా మండలాలు పరిశీలన జోన్‌లో ఉన్నాయి. రాబోయే మూడు రోజుల్లోనూ ఉష్ణోగ్రతలు ఇదే మాదిరిగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణంలో హెచ్చుతగ్గుల కారణంగా రాత్రి చలిగాలులు వీస్తూ తెల్లవారుజామున మంచు కురుస్తుంది.



స్వెట్టర్లు వేసుకుని స్కూల్‌కు వెళ్తున్న చిన్నారులు

ఇంకా 'పంచాయతీ' వేతనాలే..

- మున్సిపాలిటీగా మారిన 'ఆసిఫాబాద్'
- అయినా పారిశుద్ధ్య కార్మికులకు అరకొర వేతనాలు
- ఐదు నెలలుగా అవి కూడా అందకపోవడంతో అవస్థలు
- బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్



జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం

ఆసిఫాబాద్: ఏళ్లగా గ్రామ పంచాయతీగా కొనసాగిన జిల్లా కేంద్రం ఆసిఫాబాద్ అనేక అడ్డంకులు దాటుకుని ఎట్టకేలకు మున్సిపాలిటీగా మారింది. అయితే సూర్యోదయానికి కంటే విధుల్లో చేరి పట్టణ స్వచ్ఛతకు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం ఇప్పటికీ గ్రామ పంచాయతీ వేతనాలే అందుతున్నాయి. అవి కూడా ఐదు నెలలుగా పెండింగ్ ఉండటంతో సంక్రాంతి పండుగకు ముందు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసిఫాబాద్ బల్దియాగా ఏర్పడటంతో బతుకులు మారుతాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. అధికారులు చిన్నచూపు చూడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విధుల్లో 144 మంది..

ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 144 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో పది మంది ఎన్ఎంఆర్, 62 ఎంపీడబ్ల్యూ వర్కర్లు, 72 మంది రోజువారీ కార్మికులు ఉన్నారు. గతంలో గ్రామ పంచాయతీలో పనిచేసిన సిబ్బంది ప్రస్తుతం బల్దియా పరిధిలోకి మారారు. గ్రామ పంచాయతీలో కార్మికులకు రూ.8,500 వేతనం చెల్లిస్తుండగా, మున్సిపాలిటీలో పనిచేసే వారికి రూ.18 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారినప్పటికీ నేటికీ కార్మికులకు మాత్రం గ్రామ పంచాయతీ వేతనాలే చెల్లిస్తున్నారు. వేతనం అధికంగా ఉంటుందని అనేక మంది మున్సిపాలిటీలోనే కొనసాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయినా వారికి నెలనెలా వేతనాలు రాకపోవడంతో కష్టాలు పడుతున్నారు. అలాగే కార్మికుల రక్షణకోసం ఇవ్వాల్సిన గ్లౌజ్‌లు, షూలు, నూనె, సబ్బులు, యూనిఫాంలు సైతం సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తున్నారు.

రూ.1.15 కోట్ల బకాయిలు

జిల్లా కేంద్రం పరిధిలో పనిచేసే కార్మికులకు ప్రతినెలా రూ.13 లక్షలు వేతనాల కింద చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ వేతనాల ప్రకారం ఐదు నెలల్లో రూ.65 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. మున్సిపాలిటీ వేతనాల ప్రకారం వీరికి నెలకు రూ.23 లక్షల చొప్పున ఐదు నెలలకు రూ.1.15 కోట్లు చెల్లించాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలో మున్సిపాలిటీగా ఏర్పడినప్పటికీ గ్రామ పంచాయతీ ప్రకారమే చెల్లిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. నెలనెలా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆరోపించారు. కుటుంబ పోషణ, పిల్లల ఫీజులు భారమవుతన్నాయని వారు పేర్కొంటున్నారు.

పలుమార్లు ఆందోళనలు

డిమాండ్లు నెరవేర్చాలని మున్సిపల్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేసినా ఇప్పటివరకు ఎలాంటి మార్పులేదు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలని కార్మికులు కోరుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళ్తామని ఇటీవల సమ్మె నోటీసులు సైతం అందించారు.

ఆర్థిక ఇబ్బందులు



ఐదు నెలలుగా మున్సిపల్ కార్మికుల వేతనాలు అందడం లేదు. కుటుంబ పోషణ, అత్యవసరాలతో పాటు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వం ఇక నుంచి నెలనెలా వేతనాలు చెల్లించాలి. – మాట్ల రాజు, మున్సిపల్ కార్మికుడు

రూ.26 వేలు చెల్లించాలి



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. వారందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి ప్రభుత్వం అండగా నిలవాలి. – శ్రీకాంత్, కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం

కార్మికుల వేతనాల సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో వేతనాలు చెల్లించేందుకు, కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. – భుజంగరావు, మున్సిపల్ కమిషనర్, ఆసిఫాబాద్

పువ్వు ఇచ్చి.. నిబంధనలు వివరించి

ఆసిఫాబాద్‌అర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఆటోస్టాండ్ వద్ద వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జి.కవిత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను ఆపి గులాబీ పువ్వు అందిస్తూ హెల్మెట్ వినియోగంతో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది డి.సంతోష్‌కుమార్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



గులాబీ పువ్వు ఇస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

పత్తి చేనులో మృతదేహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి పంచాయతీలోని కొత్తపల్లి శివారు గల పత్తి చేనులో గుర్తుతెలియని కుళ్లిన మృతదేహం లభ్యమైంది. ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. వేంపల్లికి చెందిన మొగిళి సత్యం కొత్తపల్లి శివారులో పత్తి సాగు చేస్తున్నాడు. గురువారం పత్తిని ఏరేందుకు సమాయత్తం కాగా ఆ చేను నుంచి దుర్వాసన వచ్చింది. పరిసరాలు పరిశీలించగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఎత్తు దాదాపు 5.6 ఫీట్లు ఉండి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్తు ప్రతిభ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోర్జరీ కేసులో ఒకరి అరెస్టు

దండేపల్లి: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో ఒకరిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కొత్తమామిడిపల్లికి చెందిన ఎంబడి సురేందర్ కొందరు రైతుల నుంచి మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేశాడు. ఆ ధాన్యాన్ని ఈనెల 2న జమ్మికుంట మిల్లుకు తరలించే క్రమంలో ఫాం నంబర్ 10లో ప్రత్యేకాధికారి తహసీల్దార్ సంధ్యారాణి సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. పక్కా సమాచారం మేరకు ఆర్‌ఐ భూమన్న లారీని గూడెం చెక్‌పోస్టు వద్ద పట్టుకుని తనిఖీ చేయగా తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తేలింది. ఆర్‌ఐ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై వెల్లడించారు.

బీఆర్‌ఎస్ నాయకులపై కేసు

చెన్నూర్: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇటీవల రోడ్డుపై బైఠాయించి ప్రయాణికులకు ఇబ్బంది కల్గించిన 15 మంది బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. గురువారం నాయకులను అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్(ట్రెసా) 2025 క్యాలెండర్‌ను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్‌లతో కలిసి కలెక్టరేట్ చాంబర్‌లో గురువారం ఆవిష్కరించారు. ఏవో మధుకర్, జిల్లాలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు సంఘీభావం



దీక్షలో కూర్చొన్న సోఫీనగర్ వాసులు

సోన్: తమ గ్రామానికి సర్వీసు రోడ్డు నిర్మించాలని మండలంలోని కడ్తాల్ గ్రామస్తులు 32 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షకు గురువారం నిర్మల్‌లోని సోఫీనగర్ కాలనీవాసులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వీసు రోడ్డు నిర్మించే వరకు తమ పోరాటం ఆదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోఫీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చిన్నయ్య, నరేశ్, గణేశ్, సంతోష్, కడ్తాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

‘ఎల్లంపల్లి’లో మొసళ్లు

- ప్రాజెక్టులో సంచారం
- ఇటీవల బ్యాక్‌వాటర్‌లో మొసలి పిల్ల
- చేపలవేట వెళ్లేందుకు జంకుతున్న మత్స్యకారులు



రాపల్లి శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టులో లభించిన మొసలి పిల్ల (ఫైల్)



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లోకి మొసలి పిల్లని వదులుతున్న అటవీ రేంజ్ అధికారి సునీత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో మొసళ్ల కలకలంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో మొసళ్లు జాలర్ల కంట పడుతుండటంతో చేపలు పట్టేందుకు జంకుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఓ మత్స్యకారుడి వలకు మొసలి చిక్కడంతో భయాందోళనకు గురై వదిలిపెట్టాడు. ఆ మొసలి ముళ్లపొదల్లోకి వెళ్లిపోయింది. వలకు చిక్కిన మొసలి ఒకటే అనుకున్న జాలర్లకు ప్రాజెక్ట్‌లో వీటి ఆనవాళ్లు కనిపించాయి. ఇవి మూడు వరకు ఉంటాయని అంటున్నారు. దీంతో చేపలు వేటకు వెళ్లాలంటే మత్స్యకారులు భయపడుతున్నారు. పదుల సంఖ్యలో మొసళ్లు సంచరిస్తున్నాయని వెనకడుగు వేస్తున్నారు. అయితే పగటిపూట చేపల వేటకు వెళ్లినా వచ్చేవరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నామని అంటున్నారు. మరోవైపు ప్రాజెక్ట్‌లోని మత్స్య సంపదను మొసళ్లు తినేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బావుల్లో సర్వసాధారణం

ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపు గ్రామాలకు చెందిన పలు నిర్వాసితులకు సంబంధించి బావులు బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయాయి. వ్యవసాయ క్షేత్రాలకు చెందిన బావులు ఉన్నాయి. మొత్తం ప్రాజెక్ట్‌లో నిత్యం మొసళ్లు అటూ ఇటూ తిరుగుతూ బావుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. గతంలో వ్యవసాయ బావుల్లో పడిన మొసళ్లను అటవీ అధికారుల సహాయంతోబయటకు తీసి ప్రాజెక్ట్‌లోకి తిరిగి వదిలిపెట్టారు.

ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లో..

‘ఎల్లంపల్లి’లో ఓ మత్స్యకారుడు చేపలు పట్టేందుకు చేసిన వినూత్న ఆలోచనకు ఏకంగా మొసలి చిక్కింది. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కునారపు రామయ్య ఇటీవల చేపలు పట్టేందుకు వెదురుతో ఓ బుట్ట తయారు చేసి బ్యాక్‌వాటర్‌లో పెట్టాడు. రెండు రోజుల తర్వాత బుట్ట చూడగా మొసలి పిల్ల చిక్కుకుంది. బుట్టతో సహా మొసలిని రామయ్య ఇంటికి తీసుకువెళ్లాడు. స్థానికులు పెద్ద ఎత్తున చేరుకుని మొసలిని చూసి ఆనందపడ్డారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఆరునెలల మొసలితో ఉన్న బుట్టను ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో వదిలిపెట్టారు.

భయంగా ఉంది



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో పదుల సంఖ్యలో మొసళ్లు ఉన్నాయి. జాలర్లకు మొసళ్లు కనిపించాయి. ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లాలంటే భయంగా ఉంది. అధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలి. – బొగ్గుల చంద్రశేఖర్, మత్స్యకారుడు, నంనూర్

పతంగులు ఎగురవేసే వేళ జాగ్రత్త

- చైనామాంజా వాడొద్దు
- స్తంభాలు, తీగల వద్ద గాలిపటాలు ఎగురవేయొద్దు
- బహిరంగ ప్రదేశాల్లో ఎగురవేయాలి



రక్షణ గోడలేని భవనంపై పతంగులు ఎగరేస్తున్న చిన్నారులు

దండేపల్లి: సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ. పల్లెల్లో ఇప్పటి నుంచే పతంగుల సందడి ఊపందుకుంది. దుకాణాల్లో రంగురంగుల పతంగులు విక్రయిస్తున్నారు. దీంతో పాఠశాలకు సెలవు వస్తే చాలు విద్యార్థులు గాలిపటాలు ఎగరేస్తున్నారు. చిన్నా పెద్దలు పతంగులు ఎగురవేయడంపై ఆసక్తి చూపిస్తుంటారు. పతంగులు నింగిలో ఎగురుతుంటే పిల్లల కేరింతలు హోరెత్తుతాయి. పతంగులు కొత్త పుంతలు తొక్కే క్రమంలో చైనా మాంజా దారం వచ్చింది. దీని ద్వారా పక్షులకు, వ్యక్తులకు హాని జరుగుతుందనే అటవీశాఖ 2007లో నిషేధించింది. పూర్తిస్థాయి నిషేధం అమలు కాకపోవడంతో అక్కడక్కడ మాంజా దొరకడం, పతంగులకు కట్టి ఎగిరేయడం సాధారణంగా మారింది. పలుచోట్ల పతంగులను ప్రమాదకర ప్రాంతాల్లో ఎగురవేస్తూనే ఉన్నారు. పండుగ వేళల్లో జాగ్రత్తలు పాటించకుంటే విషాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

- శిథిల భవనాలు, రక్షణ గోడలేని భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, నీటి ట్యాంకుల పైకి ఎక్కి పతంగులు ఎగరవేయొద్దు.
- సీసీ దారులు, రహదారులు వద్ద దారం, మాంజా దారం వేలాడుతూ కనిపిస్తే తీసివేయాలి. లేకుంటే వాహనదారులు, పాదాచారులకు తగిలి గాయాలయ్యే పరిస్థితి ఉంది.
- బహిరంగ ప్రదేశాల్లోనే పతంగులు ఎగురవేయాలి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగల దగ్గరగా గాలిపటాలు ఎగురవేయడం ప్రమాదకరం.
- విద్యుత్ తీగల మీద పడిన గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించారు.
- మెటాలిక్ దారాలు వినియోగించడం వల్ల విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉంది.

చైనామాంజాపై నిషేధం

పంతంగులు ఎగురవేసేటప్పుడు చైనా మాంజాదారాలు వాడొద్దు. వాటితో పక్షులు, మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. చైనా మాంజా దారాన్ని అటవీశాఖ నిషేధించింది. దీనిపై ఇప్పటికే కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాం. చైనా మాంజా దారాలు విక్రయిస్తే చర్యలు తప్పవు. – సుష్మరావు, ఎఫ్ఆర్వో, తాళ్లపేట

విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి



మడావి భీంరావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని దుబ్బగూడలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం దావెన్‌గూడ గ్రామానికి చెందిన మడావి బాదిరావ్, మాద్కుబాయి దంపతులకు చెందిన ఐదుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు మడావి భీంరావ్ ఉన్నాడు. భీంరావ్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. వ్యవసాయ పనులకు వెళ్తున్న తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. ఇంద్రవెల్లి మండలంలోని దుబ్బగూడలో ఉంటున్న తన అక్క యేర్మ సీతాబాయి ఇంటికి రెండు రోజుల క్రితం భీంరావ్ వెళ్లాడు. గురువారం అక్క ఇంట్లో ఉయ్యాల తాడును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రగాయాలైన భీంరావ్‌ను బంధువులు అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి బాదిరావ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాంగ్విలో రైతు..

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన రైతు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం ..పంతుల భూమన్న (69) ఎప్పటిలాగే బుధవారం సాయంత్రం తన పంట చేనుకు వెళ్లాడు. నీరు పెట్టేందుకు మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఎంతకీ భూమన్న ఇంటికి రాకపోవడంతో బంధువులు చేనుకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటన స్థలాన్ని పరిశీలించారు. భార్య అడెల్లా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



భూమన్న మృతదేహం

కుర్మపల్లి చెరువు వద్ద ఒకరు..

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి చెరువు వద్ద బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి ఒకరు మృతిచెందాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామానికి చెందిన ఆర్.సురేష్ (35) ఓ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కుర్మపల్లి చెరువు వద్ద ఓ విద్యుత్ స్తంభం పైకి ఎక్కాడు. ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కిందపడిపోయాడు. వెంటనే మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేస్లాపూర్‌కు చేరిన ప్రచార రథం



మెస్రం వంశీయుల ప్రచార రథం

ఇంద్రవెల్లి: నాగోబా జాతరపై ప్రచారం నిర్వహించేందుకు ఈ నెల 2న కేస్లాపూర్ నుంచి ప్రారంభించిన ప్రచారరథం తిరిగి గ్రామానికి చేరుకుంది. ఇంద్రవెల్లి, సిరికొండ, ఇచ్చోడ, ఉట్నూర్ మండలాల్లోని మెస్రం వంశీయులున్న గ్రామాలకు ప్రచారం రథం వెళ్లింది. దీని ద్వారా ప్రచారం నిర్వహించిన కటోడ మెస్రం కోసేరావ్, పర్ధాన్ మెస్రం దాదారావ్ గురువారం సాయంత్రం కేస్లాపూర్ గ్రామానికి చేరారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి వద్దకు చేరి పవిత్ర గంగాజలం కోసం పాదయాత్ర ప్రారంభిస్తారని నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. జన్నారం మండలంలోని గోదావరి హస్తిన మడుగుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం



కాలుతున్న పత్తి

వాంకిడి: మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్ వద్ద గల ఆర్‌బీ ఇండస్ట్రీయల్ జిన్నింగ్ మిల్లులో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి లోడుతో మిల్లుకు వచ్చిన బొలెరో వాహనంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే వాహనాన్ని బయటకు తీసుకెళ్లే క్రమంలో మిల్లులో పత్తి కుప్పలకు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన కార్మికులు నీళ్లు చల్లి మంటలార్పారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు 10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైందని సీసీఐ అధికారి పన్నాలాల్ తెలిపారు.

గంజాయి విక్రయించిన వ్యక్తికి ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: గంజాయి విక్రయించిన వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్ కోర్టు ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి.రమేశ్ గురువారం తీర్పునిచ్చారు. జైనూర్ సీఐ రమేశ్ కథనం ప్రకారం.. జైనూర్ మండలంలోని గౌరీ గ్రామానికి చెందిన సిడం భరత్ తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. 2021 అక్టోబర్ 14న అప్పటి ఎస్సై తిరుపతి తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. భరత్‌ను విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అప్పటి సీఐ హనూక్ కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్ సాక్షులను కోర్టులో హాజరుపర్చి నేరం రుజువు చేశారు. ఈమేరకు నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, ఎస్సై సాగర్, లైజనింగ్ ఆఫీసర్ రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ మృతి



ఆత్రం మారుతి (ఫైల్)

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన యేమునబాయి, ఆత్రం మారుతి(25) అక్కాతమ్ముళ్లు. వీరి చిన్నవయసులో తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. అక్కాతమ్ముళ్లు ముత్నూర్‌లోని అమ్మమ్మ వద్ద పెరిగారు. ఉట్నూర్ మండలం సాలేవాడకు చెందిన నైతం మనోహర్‌తో యేమునబాయికు పెళ్లయింది. ముత్నూర్‌లోని జైస్వాల్ నితిన్ వద్ద మారుతి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మారుతి బుధవారం ధర్మసాగర్ గ్రామంలోని ఓ రైతు పత్తిని వాహనంలో లోడ్ చేసి సాయంత్రం మండలంలోని ఐఎఫ్‌పీసీఎల్ జిన్నింగ్ మిల్లుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఏమాయికుంట వద్ద కుక్కను తప్పించపోయి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న కిరాణా షాపుని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మారుతిని అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు రిమ్స్‌లో మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి



శ్రీకాంత్ (ఫైల్)

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామానికి చెందిన గుర్లె శ్రీకాంత్ (25) బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఎస్సై ఎస్.మధుకర్ కథనం ప్రకారం.. ఈనెల 1న శ్రీకాంత్ బైక్‌పై తన అత్తగారిల్లు అయిన కౌటాల మండలంలోని కన్నెపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గత మూడురోజులుగా జ్వరం రావడంతో అత్తారింట్లో ఉంటున్నాడు. చికిత్స నిమిత్తం బుధవారం రాత్రి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన కుమారుడిని అత్తింటివారు దాడి చేసి చంపేశారని, మృతదేహంపై గాయాలు ఉన్నాయని తల్లి నానుబాయి ఫిర్యాదు చేసింది. ఈమేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య భాగ్య, కుమారుడు రాము, కుమార్తె శ్రీదివ్య ఉన్నారు.

భార్యతో గొడవ.. టవరెక్కిన భర్త

ఉట్నూర్‌రూరల్: భార్యతో గొడవపడిన భర్త టవరెక్కి హల్‌చల్ చేశాడు. మండలంలోని బీర్సాయిపేటలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. బీర్సాయిపేటకు చెందిన మంగం తిరుపతి, జ్యోతి భార్యభర్తలు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం రాత్రి తిరుపతి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్యభర్తమధ్య గొడవ జరిగింది. గురువారం బీర్సాయిపేట పంచాయతీ కార్యాలయం సమీపాన ఉన్న టవర్ ఎక్కి తిరుపతి రెండు గంటల పాటు హంగామా చేశాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతనికి నచ్చజెప్పడంతో కిందకు దిగాడు. అనంతరం తిరుపతిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇంటికి పంపించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ



ట్విన్‌సిటీస్-స్పోర్ట్స్ స్కూల్ మధ్య మ్యాచ్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- రాష్ట్ర స్థాయి అండర్–13 ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

రామకృష్ణాపూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఖేలో ఇండియా తెలంగాణ స్థాయి అండర్ –13 బాలికల ఫుట్‌బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు జరిగే పోటీలకు సౌత్ జోన్ పరిధిలోని ఆయా జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపీ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడాపతాకాల ఆవిష్కరణ అనంతరం వివిధ జిల్లాల జట్లు గౌరవ వందనం సమర్పించాయి. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ గెలుపోటములను లెక్క చేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. తనకు కూడా చిన్ననాటి నుంచి క్రీడలంటే ఇష్టమని, ఒలింపిక్స్ స్థాయిలో రాణించేలా తెలంగాణ క్రీడాకారులు తయారు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, మందమర్రి జీఎం దేవేందర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్, సీఐ శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నీలం శ్రీనివాస్‌గౌడ్, గోపతి రాజయ్య, అజీజ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఉత్సాహంగా..

అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో తొలిరోజు రెండు లీగ్‌మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ సిద్దిపేట జట్టుపై కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో ట్విన్ సిటీస్ హైదరాబాద్ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ జట్టు విజయం సాధించింది.

జంగున్‌బుయ్యారి వద్ద ఆదివాసీల పూజలు



పూజలు చేస్తున్న రాంజీగూడ ఆదివాసీలు



గంగస్నానానికి బయల్దేరి వెళ్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: పుష్యమాసం పరస్కరించుకొని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి, భీమాల్ దేవుడు, పెర్సపేన్ (పెద్ద దేవుడు) పూజలను ఆదివాసీలు నిర్వహిస్తున్నారు. అనంతరం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దేవతలకు గంగస్నానాలు ఆచరించి తమ తమ గ్రామాలకు చేరుకుని పూజలు చేస్తున్నారు. మండలంలోని తుమ్మగూడ పంచాయతీ పరిధిలోని రాంజీగూడ, సిరికొండ మండలం కుంటగూడ, ఆదిలాబాద్ మండలంలోని కొత్తుర్ గ్రామానికి చెందిన ఆది వాసీలు గురువారం జంగున్‌బుయ్యారి దేవస్థానికి వెళ్లి సంప్రదాయ వాయిద్యాల మధ్య పూజలు చేశా రు. పుష్యమాసం ముగింపు వరకు ఈ పూజలు కొనసాగుతాయని ఆదివాసీలు తెలిపారు. పూజార్లు తొడసం బండు, జుగాదివార్ తదితరులు ఉన్నారు.

బావాపూర్(ఆర్)లో కాకతీయుల ఆనవాళ్లు



బావాపూర్(ఆర్) శివారులో కాకతీయులనాటి గణపతి విగ్రహం

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామ శివారులో కాకతీయ అనంతర కాలానికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కరిపె రాజ్‌కుమార్ గ్రామ శివారులో గురువారం పర్యటించారు. పలు ఆనవాళ్లను గుర్తించారు. ఈ ప్రాంతంలో అత్యంత అరుదైన ప్రాచీన గణపతి శిల్పాన్ని గుర్తించారు. ఈ శిల్పం లలితాసనం, చతుర్భుజు డు, అంకుశం, గొడ్డలి, దంతం, ఉండ్రాళ్లతో చేతులు, ఉదరంపై నాగబంధం ఉన్నాయని వివరించా రు. వీటి ఆధారంగా ఇవి ముమ్మాటికీ కాకతీయుల అనంతర కాలానికి సంబంధించినవిగా చెప్పవచ్చని తెలిపారు. మరిన్ని ఆనవాళ్లు ఉన్నప్పటికీ గు ర్తించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉండే ఖానాపూర్ ప్రాంత అడవుల్లో ప్రాచీన విగ్రహాలు, కట్టడాలు చాలా ఉన్నాయని, వాటిని ఆర్కియాలజీ శాఖ వారు వెలికి తీసి నేటి తరానికి తెలియజేయాలని కోరారు.

ఆటోడ్రైవర్ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ సమీపంలో ఈనెల 7న ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు ప్రాణాలను బలిగొన్న డ్రైవర్ పాలెపు రాకేశ్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బోథ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన పాలెపు రాకేశ్ మంగళవారం తన ఆటోలో గ్రామస్తులను మొక్కులు చెల్లించుకునేందుకు దేగామ పోచమ్మ ఆలయానికి తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో రాకేశ్ అతిగా మద్యం తాగి అతివేగంగా, నిర్లక్ష్యంగా ఆటో నడపడంతో మూలమలుపు వద్ద బోల్తాపడింది. ఈఘటనలో మహిళ అడెల్ల అక్కడికక్కడే మృతిచెందగా, మైలారపు అరుణ్, అయిల ఆశన్నలు ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. ముగ్గురి మృతికి కారణమైన రాకేశ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో బజార్‌హత్నూర్ ఎస్సై అప్పారావ్, ఏఎస్సై ధరంసింగ్, చంపత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ లారీల అడ్డగింత

జైపూర్: మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు లారీలను రామారావుపేట వాసులు గురువారం అడ్డుకున్నారు. రామారావుపేట నుంచి గోదావరి నది సమీపంలో పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించారు. ఐకే-ఓసీపీ మట్టిని గోదావరి నది సమీపంలో డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఏళ్లుగా నిర్మించుకున్న రోడ్డును తొలగించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సౌకర్యార్థం ఈ రోడ్డును అలాగే ఉంచాలని కోరారు. కాగా, లారీల అడ్డుకోవడంతో స్థానికులు, అధికారులు మధ్య వాగ్వాదం జరిగింది. ఉన్నతాధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.